తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
గురువారం
01 అక్టోబర్ 2026
సంపుటి 03
సంచిక 352
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## 22ఏలో మరిన్ని రకాల ఆస్తుల రిజిస్ట్రేషన్

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- నిషేధిత ఆస్తుల జాబితాపై పునఃపరిశీలన

హైదారాబాద్, సెప్టెంబర్ 30 22ఏలోని నిషేధిత జాబితా పరిధిలో ఉన్న పలు రకాల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం మరింత ఉపశమనం కల్పించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇదివరకు ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతులు పొందిన లేదా కోర్టు తీర్పులు ఉన్న ఆస్తులను సెక్షన్ 22ఏ పరిమితి నుంచి మినహాయించి రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇస్తున్న విధానాన్నే, ఇప్పుడు సెక్షన్ 22ఏ(1)బి కింద ఉన్న ఆస్తులకు కూడా వర్తింపజేయాలని సర్కార్? నిర్ణయించింది. ఈ మేరకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం దీనికి సంబంధించిన మెమోను జారీ చేశారు. సెక్షన్ 22ఏకు సంబంధించిన వివిధ సమస్యలను

➤ మిగతా 2వ పేజిలో..

## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

- ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం..
- దేశవ్యాప్త ఆందోళనలకు కూటమి పిలుపు
- అక్టోబర్ 6న విపక్ష ఎంపీల ప్రదర్శన..
- కూటమి ఉద్యమ కార్యాచరణ ఖరారు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా

➤ మిగతా 2వ పేజిలో..

## గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

- సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
- జెండా ఎగురవేసిన మొనగాడికి మంత్రి పదవి
- భవిష్యత్తులో మంత్రివర్గంలోకి తీసుకుంటా..
- గత ప్రభుత్వం సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చారు
- సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా
- తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లతో రాజకీయ లబ్ది
- కల్వకుంట్ల కుటుంబం ఆస్తులు కూడబెట్టుకున్నారు
- సిరిసిల్ల ప్రజాపాలన బహిరంగ సభలో సిఎం రేవంత్
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి ఎన్నిసార్లైనా వెళ్తా..
- కరీంనగర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కలెక్టరేట్ నూతన భవన సముదాయం ప్రారంభం
- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరణ
- అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ శ్రీకారం




సిరిసిల్ల, సెప్టెంబర్ 30: గజ్వేల్ గడీ కూల్చినట్లే ఈసారి సిరిసిల్ల గడీని నేలమట్టం చేద్దామని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కేసీఆర్ కుటుంబంపై సీఎం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గరుడ పక్షి దెబ్బ కాకి పిల్లకు ఏం తెలుసని ఎద్దేవా చేశారు. అమెరికా హోటళ్లలో ప్లేట్లు కడిగిన వ్యక్తికి తన విలువ ఎలా తెలుస్తుందని ఘాటుగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లలో నిద్రపోయిన వారికి తన గురించి బాగా తెలుసని వ్యాఖ్యానించారు. సిరిసిల్ల

➤ మిగతా 2వ పేజిలో..

## ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

- ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై చర్చ!
- ప్రపంచ శాంతి భద్రతలపైనా సమాలోచనలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం అత్యంత ప్రాధాన్యత కలిగిన ఫోన్ సంభాషణ జరిగింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల అగ్రనేతలు ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా సమీక్షించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా అధికారికంగా వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య పరస్పర వాణిజ్యం, రక్షణ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వనరులు, కీలక అధునాతన సాంకేతిక రంగాలలో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇద్దరు నేతలు

➤ మిగతా 2వ పేజిలో..

## మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు



- వచ్చే ఎన్నికల్లో సిఎం అభ్యర్థిని నేను కాదు
- కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారు
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- బీఆర్ఎస్-బీజేపీ మధ్య పొత్తు ఉండబోదు
- రాష్ట్ర రాజకీయాలపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదారాబాద్, సెప్టెంబర్ 30 వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ స్పష్టం చేశారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే కాన్‌క్లేవ్ సౌత్ 2026లో ఆయన తెలంగాణ రాజకీయాలు, బీఆర్ఎస్ భవిష్యత్తు, బీజేపీతో పొత్తు, డీలిమిటేషన్, ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాలపై మాట్లాడారు. తాను ప్రధాన రాజకీయ పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో సీఎం అభ్యర్థి మీరేనా అని అడిగిన ప్రశ్నకు కేటీఆర్ స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని చెప్పారు. 2 ఏళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ స్వల్ప తేడాతో అధికారాన్ని కోల్పోయిందని చెబుతూ.. ప్రస్తుతం ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ అనే 3 పదాలను కేటీఆర్ ఉపయోగించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని.. పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారని.. భవిష్యత్తులో తిరుగుబాటు వస్తుందని ఆయన తన రాజకీయ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్,

➤ మిగతా 2వ పేజిలో..

## అదనపు డిక్లరేషన్ తొలగింపు

- ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఫారం-6లో కీలక మార్పు చేసిన ఈసీ
- సర్ పూర్తయిన రాష్ట్రాలకు వర్తింపు




న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) వివాదం కొనసాగుతున్న వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే వారికి సంబంధించిన ఫారం-6లో కీలక మార్పు చేసింది. సర్? ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫారం-6తో పాటు జత చేసిన అదనపు సర్? డిక్లరేషన్?ను తొలగించింది. అదనపు నిబంధన కేవలం సవరణ ప్రక్రియ జరిగే సమయంలో మాత్రమే వర్తిస్తుందని, సర్? ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో మాత్రం వర్తించదని తెలిపింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషితో కూడిన పూర్తిస్థాయి కమిషన్ ఈనెల 26న

➤ మిగతా 2వ పేజిలో..



## యూపీ పోలీసు విభాగాన్ని రద్దు చేస్తాం

- అన్ని కేసులు సీబీఐకి అప్పగిస్తాం
- యూపీ పోలీసులపై సుప్రీం ఆగ్రహం
- పోలీసుల దర్యాప్తు తీరుపై తీవ్ర అసహనం

➤ 2వ పేజిలో..

## ఏఐ కాదు.. ఇకపై ఎస్ఐ

- సూపర్ ఇంటెలిజెన్స్‌గా పేరు మార్పు
- డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం



న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ అధికారిక వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పదానికి బదులుగా సూపర్ ఇంటెలిజెన్స్ అనే పదాన్ని ఉపయోగించాలని ఆదేశిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వైట్‌హౌస్‌లో టెక్ దిగ్గజాలతో

➤ మిగతా 2వ పేజిలో..

# గజ్వేల్ గడీ కూల్చినట్లే సిరిసిల్ల గడీని కూల్చేస్తాం

నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. గత రెండున్నరేళ్ల పాలనలోనే సిరిసిల్ల అభివృద్ధికి రూ.1,500 కోట్లు కేటాయించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేసిన నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకుంటానని ముఖ్యమంత్రి సంచలన ప్రకటన చేశారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు ఏమీ చేయకుండా టీవీ ఛానళ్లు, పత్రికలు, ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్లు మాత్రమే సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. టెండర్లు వేసి కేవలం కమీషన్లు దండుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారని మండిపడ్డారు. చివరకు ఆడబిడ్డలకు ఇచ్చే బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు కొట్టి తిన్నారని తీవ్ర పదజాలంతో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు 'పుట్టింటి సారె' ద్వారా నాణ్యమైన చీరలను అందిస్తూ సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్‌గా ఉన్న దళిత బిడ్డ గడ్డం ప్రసాద్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే అహంకారంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ ముందు దళితులు డప్పు కొడితే ఆ స్థలాన్ని పసుపు నీళ్లతో కడిగించారని, ఇది తీవ్రమైన అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను బహిష్కరించే వరకు సమాజం వదలదని హెచ్చరించారు. ఎర్రవెల్లి భూ ఆక్రమణలతో పాటు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావ్ అక్రమ ఆస్తుల లెక్కలు తేలుస్తామని, డెక్కన్ స్టార్ హోటల్స్ తదితర ఆస్తుల వివరాలను అసెంబ్లీలో సమయం చాలక దాచామని, త్వరలోనే పార్ట్-2 పేరుతో ప్రజల ముందు పెడతామని సీఎం స్పష్టం చేశారు. సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే నాయకుడిని కేబినెట్ బెర్త్ కన్ఫార్మ్ అంటూ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. సిరిసిల్ల గడీల మీద గురిపెడదాం.. ఫిరంగులమై పేలుదాం అంటూ కార్యకర్తల్లో జోష్ నింపేలా వ్యాఖ్యలు చేశారు. గతంలో గజ్వేల్ గడీ విషయంలో తాము చెప్పినది చేసి చూపించామని.. ఇప్పుడు సిరిసిల్లపై దృష్టి పెట్టామని రేవంత్ రెడ్డి అన్నారు. సిరిసిల్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేసే నాయకుడికి మంత్రి పదవి ఇస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌లో కుటుంబ సభ్యులకు కీలక పదవులు దక్కాయని.. కాంగ్రెస్‌లో మాత్రం పార్టీ కోసం పనిచేసిన సాధారణ కార్యకర్తలు, నాయకులకు కూడా అవకాశాలు లభిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గత 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్ల సమస్యలకు నిలయంగా మారిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా చేనేత, నేత కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వం వారి ఇబ్బందులను పరిష్కరించలేకపోయిందని విమర్శించారు. నేత కార్మికుల ఆత్మహత్యలు, ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలసలు వంటి అంశాలపై ఆయన ప్రశ్నలు సంధించారు. కేసీఆర్ కుటుంబం సిరిసిల్ల ప్రజల గురించి ఏనాడైనా ఆలోచించిందా అని ప్రశ్నించిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమం, ప్రజల ఓట్లను రాజకీయంగా ఉపయోగించుకుని ఆస్తులు కూడబెట్టుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఆస్తులపై కూడా ఆయన పలు విమర్శలు చేశారు. సిరిసిల్ల ఎమ్మెల్యేగా కేటీఆర్ 2009 నుంచి వరుసగా ఎన్నికవుతున్న విషయాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి.. ఇంతకాలం ప్రాతినిధ్యం వహించినప్పటికీ నియోజకవర్గంలోని నేత కార్మికుల సమస్యలు ఎందుకు పూర్తిగా పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. కేటీఆర్ అమెరికా నుంచి వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే టికెట్ పొందారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేటీఆర్‌పై విమర్శలు చేస్తూ వ్యక్తిగత వ్యాఖ్యలు కూడా చేశారు. ఫామ్‌హౌస్‌లు, ఫారిన్ లైఫ్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలోనూ అవినీతి జరిగిందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కరీంనగర్ కలెక్టరేట్ నిర్మాణం ఎందుకు పూర్తికాలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెండర్లు, కమీషన్ల విషయంలో గత ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టింటి సారె పేరుతో ఆడబిడ్డలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వివరించారు. సిరిసిల్ల చేనేత, నేత కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో రూ.2,234 కోట్లు ఖర్చు చేస్తే.. తమ ప్రభుత్వం రెండున్నరేళ్ల కాలంలో రూ.1,731 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. సిరిసిల్ల జిల్లాకు కూడా తమ ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. ఇదే.. సిరిసిల్ల సభలో ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా మండలికి పంపాలని ఆయన కోరారు. సిరిసిల్ల నుంచి కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వాన్ని తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కలిసి పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. సిరిసిల్ల పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు బీఆర్ఎస్‌పై రాజకీయంగా కూడా సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కాంగ్రెస్ బలపడటమే లక్ష్యంగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం తాను ఎన్నిసార్లైనా ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి నిధులు, అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను కలవాల్సి ఉంటున్నారు. రాష్ట్రంలోని దాదాపు పదిన్నర లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 4 కోట్ల ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య బలమైన వారధులుగా ప్రభుత్వ ఉద్యోగులు నిలుస్తున్నారని కొనియాడారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం నాడు ఆయన నూతనంగా నిర్మించిన కరీంనగర్ కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు నిజమైన పేదలకు చేరాలంటే ఉద్యోగుల కష్టపడే తత్వమే కీలకమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్‌కు సమస్యలతో వచ్చే ప్రజలను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి వారికి సాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## అదనపు డిక్లరేషన్ తొలగింపు

సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈసీ నిర్ణయం ప్రకారం, సర్? ప్రక్రియ పూర్తయిన ప్రాంతాల్లో కొత్త ఓటర్లు ఇకపై ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్దేశించిన సాధారణ ఫారం-6ను మాత్రమే పూర్తి చేయాల్సి ఉంటుంది. సర్? ప్రక్రియ ఇంకా కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం అదనపు డిక్లరేషన్ అందుబాటులో ఉంది. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే దరఖాస్తుదారులు తాము లేదా తమ తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మలు గతంలో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాల్లో ఉన్నారనే వివరాలను అందించాల్సి ఉంటుంది. ఈ అదనపు ప్రకటనను సర్? ప్రక్రియలో భాగంగానే ఎన్నికల సంఘం తీసుకొచ్చింది. అయితే సవరణ పూర్తయిన ప్రాంతాల్లో దాని అవసరం ఉండదని స్పష్టం చేస్తూ తాజాగా ఆప్షన్‌ను తొలగించింది. సర్? పూర్తయిన ప్రాంతాల్లో అదనపు డిక్లరేషన్?ను ఈసీఐనెట్? యాప్?, పోర్టల్ నుంచి తొలగించారు. సంబంధిత రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) వెబ్‌సైట్లలోనూ ఇదే మార్పు చేశారు. ఇక ఆయా రాష్ట్రాల్లో ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే పౌరులు రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారం-6లో అవసరమైన వివరాలను మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఫారం- 6కు జత చేసిన అదనపు డిక్లరేషన్ కేవలం సర్? ప్రక్రియ కోసమేనని అందులో ఈసీ పేర్కొంది. సర్? అమలు లేని సమయంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 ప్రకారం వర్తించే సాధారణ ఫారమ్‌లనే ఉపయోగిస్తామని స్పష్టం చేసింది. దీంతో సర్ పూర్తయిన ప్రాంతాల్లో సాధారణ ఫారం-6 ప్రక్రియకు తిరిగి వెళ్లేలా ఆన్‌లైన్ వ్యవస్థలో మార్పులు చేశారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన చట్టబద్ధ ప్రక్రియలో అదనపు సర్ వివరాలను అడగడం ఇకపై ఉండదు. ఫారం-6కు సంబంధించిన మార్పులపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వార్తలు రావటం ఇటీవల వివాదాస్పదంగా మారింది. ఫారం-6లో చేసిన మార్పుల అంశం గతంలో ఎన్నికల సంఘంలోనే చర్చనీయాంశమైంది. ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకునేందుకు అర్హులైన భారతీయ పౌరులు ఉపయోగించే చట్టబద్ధమైన ఫారమ్‌గానే ఫారం-6ను రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960 నిర్దేశిస్తుంది. ఈ ఫారమ్‌లో మార్పులు చేయడంపై ఎన్నికల కమిషనర్ వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. నిబంధనల ద్వారా నిర్దేశించిన ఫారమ్‌ను సంబంధిత నిబంధనలను సవరించకుండా మార్చలేదని, అలాగే ఈసీఐనెట్?లో ఫారం-6 దరఖాస్తు ప్రక్రియకు సర్?కు సంబంధించిన అదనపు డిక్లరేషన్‌ను జత చేయడంపైనా సంధు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## యూపీ పోలీసు విభాగాన్ని రద్దు చేస్తాం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30 ఉత్తరప్రదేశ్ పోలీసుల దర్యాప్తు తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరమైతే యూపీ పోలీసు విభాగాన్నే రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక క్రిమినల్ కేసులో పోలీసులు అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని గమనించిన న్యాయస్థానం ఈ ఘాటు వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించింది. తనపై దాడికి యత్నించిన ఒక మోటార్ సైకిలిస్టును పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే, వారు మాత్రం గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ వ్యవహారంపై యూపీ పోలీసులు దాఖలు చేసిన అఫిడవిట్‌పై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. "నిందితుడిని ఘటనా స్థలంలోనే పట్టుకున్నప్పుడు, గుర్తుతెలియని వ్యక్తిపై ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు? ఇలా చేస్తే ప్రజలకు పోలీసులపై నమ్మకం ఎలా ఉంటుంది?" అని ధర్మాసనం ప్రశ్నించింది. "మీ ప్రతి పనిలో ఒక అజెండా కనిపిస్తోంది. ఈ అసంబద్ధతకు ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట పడాలి. యూపీ పోలీసులను రద్దు చేసి, అన్ని కేసులను సీబీఐకి అప్పగించడమే మేలు" అని తీవ్రంగా వ్యాఖ్యానించింది. ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరుపై సరైన వివరణతో మరో అఫిడవిట్ దాఖలు చేయాలని, తదుపరి విచారణకు సంబంధిత పోలీస్ అధికారి వ్యక్తిగతంగా హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## ఏఐ కాదు.. ఇకపై ఎస్ఐ

నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో 'సూపర్ ఇంటెలిజెన్స్? శకానికి నాంది' అనే పేరుతో ఉత్తర్వును జారీ చేశారు. దీని ప్రకారం చట్టం అనుమతించే మేరకు అమెరికా ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్‌లో ఇకపై ఏఐ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? పదాల స్థానంలో ఎస్?ఐ, సూపర్ ఇంటెలిజెన్స్ పదాలను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే కృత్రిమ మేధ సాంకేతికతపై అంతర్గత, బాహ్య సమీక్షలు నిర్వహించేందుకు టెక్ సంస్థల సీఈఓలు ఒక స్వచ్ఛంద ఒప్పందంపై సంతకం చేసినట్లు ట్రంప్ ప్రకటించారు. కొత్త ఉత్తర్వు ప్రకారం అమెరికా ఫెడరల్ ప్రభుత్వంలోని అన్ని ఎగ్జిక్యూటివ్ విభాగాలు, ఏజెన్సీలు తమ అధికారిక కమ్యూనికేషన్లలో సూపర్ ఇంటెలిజెన్స్, ఎస్?ఐ పదాలను ఉపయోగించాలి. ప్రభుత్వ వెబ్‌సైట్లు, ప్రజా ప్రకటనలు, నివేదికలు, పరిపాలనా విధాన పత్రాలు, ఇతర అధికారిక సమాచారంలోనూ ఇదే పదాన్ని అమలు చేయాలని ఆదేశించింది. అయితే ఈ మార్పు గతంలో జారీ చేసిన నిబంధనలకు వర్తించదని ఉత్తర్వు స్పష్టం చేసింది. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ ఒప్పందాలు, గ్రాంట్లు, గతంలో భద్రపరిచిన రికార్డులు, ఆర్కైవ్ పత్రాలను వెనక్కి వెళ్లి మార్చాల్సిన అవసరం లేదని పేర్కొంది. కొత్త పదాన్ని అధికారికంగా అమలు చేసే ప్రక్రియలో భాగంగా మరో కీలక అంశాన్ని కూడా ఉత్తర్వులో చేర్చారు. అమెరికా చట్టంలోని టైటిల్?15లో ప్రస్తుతం ఉన్న తాత్కాలికంగా ఎస్?ఐకు వర్తింపజేయాలని నిర్ణయించారు. అదే సమయంలో ఎస్?ఐకు ప్రత్యేకమైన, కొత్త చట్టపరమైన నిర్వచనాన్ని రూపొందించే ప్రక్రియను ప్రారంభించారు. ఇందుకోసం ప్రెసిడెంట్‌కు సైన్స్ అండ్ టెక్నాలజీ వ్యవహారాల్లో సహాయకుడిగా ఉన్న అధికారి 60 రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కొత్త నిర్వచనంతో పాటు ఇప్పటికే ఉన్న అమెరికా చట్టాల్లో అవసరమైన మార్పులను కూడా సూచించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఏఐ స్థానంలో ఎస్?ఐ అనే పదాన్ని తీసుకురావడానికి సాంకేతిక రంగంలో వచ్చిన మార్పులను ట్రంప్ ప్రభుత్వం కారణంగా చూపింది. ప్రస్తుత తరం అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలు మానవ మేధస్సులోని కొన్ని అంశాలను అనుకరించడం లేదా ఆటోమేట్ చేయడానికే పరిమితం కాలేదని ఉత్తర్వులో పేర్కొంది. అవి మానవుల సృజనాత్మకతను మరింత విస్తరించడంతో పాటు కొత్త ఆలోచనలు, పరిశోధనలకు దోహదం చేస్తున్నాయని తెలిపింది. సైన్స్, వైద్యం సహా అనేక రంగాల్లో ఇప్పటివరకు సాధ్యం కాని పనులను సాధించే అవకాశాలను ఇవి కల్పిస్తున్నాయని పేర్కొంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో సుమారు 70 ఏళ్ల క్రితం ఏర్పడిన ఏఐ అనే పదం ఆధునిక సామర్థ్యాలకు పూర్తి ప్రతిబింబం కాదన్నది ట్రంప్ ప్రభుత్వ వాదన. ఈ నిర్ణయానికి ముందు వైట్‌హౌస్‌లో ట్రంప్ టెక్నాలజీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. ఏఐ అభివృద్ధిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే విషయాన్ని టెక్ కంపెనీలు అర్థం చేసుకున్నాయని ట్రంప్ తెలిపారు. తాను సెల్ఫ్ పోలీసింగ్‌ను చూస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏఐ రేసును అమెరికా, చైనా మధ్య పోటీగా అభివర్ణించిన ట్రంప్, ఇందులో వాషింగ్టన్ స్పష్టమైన ఆధిక్యంలో ఉందన్నారు.

## 22ఏలో మరిన్ని రకాల ఆస్తుల రిజిస్ట్రేషన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 30: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై పెట్టుబడి పెట్టే వారికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి (అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు) వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో గత త్రైమాసికంలో అమలైన వడ్డీ రేట్లే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రకటించారు. ఈ క్రమంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్?సీ) పరిధిలోని ఆస్తులు, సింగరేణి భూములతో పాటు ఎల్బీ నగర్ ప్రాంతంలోని ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు ఉన్న అడ్డం కులను తొలగించేందుకు ఇప్పటికే ఆదేశాలు సైతం జారీ చేశారు. దీనికి కొనసాగింపుగా ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ఇతర స్థలాలు, చెరువులు, కుంటలు, కాలువలు, ప్రభుత్వ మిగులు భూముల వంటి తదితర సెక్షన్ 22ఏ(1)బి పరిధిలోకి వచ్చే ఆస్తులపై మరోసారి పరిశీలన చేయనున్నారు. కోర్టు తీర్పులతో పాటు జీహెచ్?ఎంసీ, హెచ్?ఎండీఏ సంస్థలు లేదా ఇతర స్థానిక అధికారుల నుంచి 22ఏ(1)బి ఆస్తులకు సంబంధించి అనుమతులు ఉన్నట్లయితే వాటిని కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్‌కు అర్హత కల్పించనున్నారు. ఇలాంటి ఆస్తుల రిజిస్ట్రేషన్‌ను సులభతరం చేయాలని జిల్లా రిజిస్ట్రార్లు, సబ్? రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్? మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని అనేక మందికి ఉపశమనం కలిగిస్తుందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 24వ తేదీ నుంచి ఈ తరహా రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ మినహాయింపులు వర్తిస్తాయని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ

దృష్టి సారించారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు నడిపించేందుకు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ వాణిజ్య చర్చలు, ప్రాంతీయ భద్రతా వ్యవహారాలు కొనసాగుతున్న తరుణంలో ఈ ఫోన్ కాల్ చర్చ జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి రేకెత్తించింది. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలకమైన భద్రతా ఒప్పందాల అమలుపై నేతలిద్దరూ సమాలోచనలు జరిపినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. సైనిక రంగంలో పరస్పర భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ఇరు దేశాల రక్షణ పరిశ్రమల అనుసంధానాన్ని వేగవంతం చేయడంపై చర్చించారు. రక్షణ రంగంతో పాటు అత్యాధునిక సాంకేతికతల బదిలీ, కృత్రిమ మేధ, పరిశోధనలలో సంయుక్తంగా అడుగులు వేయడంపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది. ఇంధన రంగంలో దేశ భద్రతను పటిష్టం చేసుకుంటూనే వాణిజ్య విస్తరణకు ఉన్న అవకాశాలను ఇరు దేశాలు సమీక్షించాయి. ప్రపంచ చమురు మార్కెట్ ఒడిదుడుకులు, సహజ వనరుల సరఫరాలో స్థిరత్వాన్ని సాధించేందుకు పరస్పర సహకారం కొనసాగించాలని ఇరు పక్షాలు నిర్ణయించుకున్నాయి. ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా వాణిజ్య సుంకాలు, మార్కెట్ భాగస్వామ్యంపై ఉన్న సవాళ్లను సామరస్యంగా పరిష్కరించుకోవాలని భావించారు. సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రిహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్) నూతన శిఖరాలకు చేర్చేందుకు నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. ప్రపంచ శాంతి, ప్రాంతీయ సుస్థిరత కోసం ఇరు దేశాల బలమైన మైత్రి ఎంతో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ, పారిశ్రామిక స్థాయిలలో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు యథాతథం

మరో మూడు నెలల పాటు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయంతో పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)పై వడ్డీ రేటు 7.1 శాతం వద్ద స్థిరంగా ఉండనుంది. ఇక సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకాలపై అత్యధికంగా 8.2 శాతం వడ్డీ లభించనుంది. అదేవిధంగా, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)పై 7.5 శాతం వడ్డీ రేటు కొనసాగుతాయి. వీటితో పాటు పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై కూడా పాత వడ్డీ రేట్లే వర్తించనున్నాయి. ప్రభుత్వ సెక్యూరిటీల రాబడులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి త్రైమాసికానికోసారి ఈ వడ్డీ రేట్లను సమీక్షిస్తుంది.

## అక్టోబర్ 2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' మార్చ్

మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు 'ఓట్ బందీ' ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్ కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్? కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు.

## మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు

బీజేపీ మధ్య పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై కూడా కేటీఆర్ స్పందించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నాయని.. తాము బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ 26 ఏళ్ల చరిత్రలో బీజేపీతో పొత్తు పెట్టుకోలేదని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినప్పటికీ పార్టీ సిద్ధాంతంలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. పార్టీ డీఎన్ఏ మారలేదని.. అందువల్ల సిద్ధాంతం కూడా మారలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ భవిష్యత్తుపై విశ్వాసం వ్యక్తం చేసిన కేటీఆర్.. తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే సమయంలో గత పరాజయం కంటే పెద్ద స్థాయిలో పునరాగమనం ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపైనా కేటీఆర్ తన అభిప్రాయాలను వెల్లడించారు. లోక్‌సభ స్థానాలను పెంచడంపై మాత్రమే ఎందుకు దృష్టి పెట్టాలని ప్రశ్నించిన ఆయన.. ప్రజలకు ఎమ్మెల్యేలే తొలి స్థాయి ప్రజాప్రతినిధులుగా ఉంటారని అన్నారు. జనాభా నియంత్రణ చర్యలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం విషయంలో అన్యాయం జరగకూడదన్న ఆందోళనను కేటీఆర్ వ్యక్తం చేశారు. పార్లమెంట్ స్థానాల సంఖ్యను ప్రస్తుత స్థాయిలో కొనసాగించడంతో పాటు, ప్రాతినిధ్యం విషయంలో అనుపాత విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవసరాన్ని పూర్తిగా వ్యతిరేకించడం లేదని కేటీఆర్ చెప్పారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సవరించడం అవసరమేనని పేర్కొన్నారు. అయితే ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనే అత్యధిక ఓటర్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆరోపించారు. దీనిపై తమ పార్టీ ఎన్నికల సంఘాన్ని సంప్రదించిందని.. అన్ని వర్గాలతో చర్చించి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 2 ఏళ్ల సమయం ఉందని పేర్కొన్న కేటీఆర్.. అందువల్ల తమకు న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించే అవకాశం కూడా ఉందని వెల్లడించారు. ఎన్నికల ముందు ఎస్ఐఆర్ జరిగితే ఎదురయ్యే సమస్యలతో పోలిస్తే ప్రస్తుతం తమకు చట్టపరంగా ప్రశ్నించే సమయం ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

# నాతాళ్ళగూడెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 30 తరంగాలు

వలిగొండ మండల పరిధిలోని నాతాళ్ళగూడెం గ్రామంలో బుధవారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందిన ముగ్గురు వ్యక్తులకు సుమారుగా 1 లక్ష 15 వేల రూపాయల ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు పలుసం బాలరాజు,మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం,మాజీ ఎంపీటీసీ ఉద్దగిరి భాస్కర్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నర్సింహా,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మోటే పరందాములు,మోటే అంజయ్య,నాగార్జున, రేగు శ్రీశైలం,కొమిరే బాలేశ్వర్,ఉద్దగిరి శంకరయ్య,బాలనర్సింహా, కొరబోయిన రాజయ్య, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# వ్యాక్సినేషన్ సేవల్లో అన్ని సూచికలు మెరుగుపరచాలి

- కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ లభ్యతపై డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి పరిశీలన



**వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 30, తరంగాలు:** వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సంబంధించిన అన్ని సూచికల్లో పనితీరును మరింత మెరుగుపరచాలని డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి సిబ్బందికి సూచించారు. బానోజిపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, నర్సంపేట్-3లో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ సెషన్‌ను వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, డీఐఓ/డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ఐ. ప్రకాష్‌తో కలిసి బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా టీకాల కోల్డ్ చైన్ వ్యవస్థ, వ్యాక్సిన్‌ల లభ్యత, రికార్డులు, సంబంధిత రిజిస్టర్లను అధికారులు పరిశీలించారు. కోల్డ్ చైన్ వ్యవస్థను నిరంతరం సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. టీకాల విషయంలో ఓపెన్ వైల్ పాలసీని తప్పనిసరిగా పాటించాలని, వ్యాక్సిన్ వాయిల్ తెరిచిన వెంటనే దానిపై తెరిచిన తేదీ, సమయాన్ని నమోదు చేయాలని సూచించారు. అర్హత కలిగిన పిల్లలందరికీ టీకాలు అందేలా ఆశా కార్యకర్తల డ్యూ లిస్ట్ ప్రకారం పిల్లలను మొబిలైజ్ చేయాలని తెలిపారు. సెషన్ సైట్‌కు అవసరమైన అన్ని రకాల టీకాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే టీకాల వివరాలను ఈవిన్ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వ్యాక్సినేషన్ రిపోర్టింగ్‌ను సక్రమంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన టీకా సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, వ్యాక్సినేషన్ కార్యక్రమంలోని అన్ని సూచికల్లో పనితీరును మెరుగుపరచాలని డీఎంహెచ్ఓ డా. బి. రాజా రెడ్డి ఆదేశించారు.

# రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కు స్వాగతం పలికిన బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్



**నల్గొండ ప్రతినిధి , సెప్టెంబర్ 30 (తరంగాలు):** సకాలంలో వర్షాలు లేక, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు నల్గొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ రాష్ట్ర నాయకులు పాలకూరి రవి గౌడ్ శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎండిపోయిన పంట పొలాలను రామచంద్రరావు పరిశీలించి, నష్టపోయిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంట నష్టంపై రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి తగిన పరిహారం అందేలా కృషి చేస్తామని రామచంద్రరావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్ సందర్శన





- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న ఓబీసీ మోర్చా నాయకులు

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 30 (తరంగాలు):** ప్రధాని నరేంద్ర మోదీ పాలన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప కార్యక్రమాల్లో భాగంగా ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే గురుకుల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని ఉపాధ్యాయులు, విద్యార్థులతో నాయకులు మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధ మల్ల ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొన్నారు. విద్యార్థుల విద్య, వసతి సౌకర్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందగట్ల మల్లికార్జున్, రాష్ట్ర నాయకుడు బైరి మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నె రవీందర్, జిల్లా నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సేవలందించడమే పీఏసీఎస్‌ల లక్ష్యం కావాలి





- నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- నూతన చైర్మన్ పింగళి వెంకటరెడ్డికి ఘన సన్మానం

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 30 (తరంగాలు):** రైతులకు సేవలందించడమే పీఏసీఎస్‌ల లక్ష్యం కావాలని,నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పీఏసీఎస్ చైర్మన్ పింగళి వెంకటరెడ్డితో పాటు నూతన పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్నప్పటికీ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పంటల కొనుగోలు వంటి అంశాల్లో రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. పీఏసీఎస్‌లు రైతులకు ఆర్థికంగా, వ్యవసాయపరంగా అండగా నిలిచే కీలక సంస్థలని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులకు రుణాలు, వ్యవసాయ అవసరాలకు సంబంధించిన సేవలు సకాలంలో అందేలా పాలకవర్గం పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ నూతన చైర్మన్ పింగళి వెంకటరెడ్డి, పాలకవర్గ సభ్యులు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మన్ కుమార్, జిల్లా, మండల, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- 'ఏక్ దిన్--ఏక్ గంటా--ఏక్ సాత్'కు ప్రజల భాగస్వామ్యం కీలకం

**భద్రాద్రి కొత్తగూడెం, జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 30:**

స్వచ్ఛత హీ సేవ--2026 కార్యక్రమంలో భాగంగా 'ఏక్ దిన్--ఏక్ గంటా--ఏక్ సాత్' కార్యక్రమాన్ని అక్టోబర్ 1న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, స్వచ్ఛత కార్మికులు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్లు, రహదారులు, పాఠశాలల పరిసరాలు, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు, నీటి వనరులు, ఇతర ప్రజా ప్రదేశాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని అధికారులు సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అదేవిధంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సక్రమంగా నిర్వహించడం, ఇంటి వద్దనే చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. స్వచ్ఛత కార్యక్రమాలు ఒక్కరోజుకే పరిమితం కాకుండా ప్రతిరోజూ కొనసాగించాలని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా అధికారులు పిలుపునిచ్చారు. "ఒక రోజు.. ఒక గంట.. మనందరం కలిసి--పరిశుభ్రమైన గ్రామం కోసం" అనే నినాదంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు కోరారు.

## భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

• జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30,తరంగాలు :** భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో భూములు కొలతలు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు.గ్రామంలో ఇప్పటివరకు ఎంతమంది రైతుల భూములను రీ సర్వే చేశారని, ఇంకా ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉందనే వివరాలను సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతంలో ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... జిల్లా లో భూముల రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, పారదర్శకంగా కచ్చితత్వంతో పూర్తి చేయాలన్నారు.భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ రీ సర్వే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ కోమీ, సర్వేయర్లు, స్థానిక రైతులు ఉన్నారు.

## స్వచ్ఛత కోసం బీజేపీ శ్రమదానం

• ప్రజా ప్రయోజనాల కేంద్రంగా బస్సు షెల్టర్‌కు పునరుజ్జీవం
• వ్యర్థాలను తొలగించి పరిసరాలను శుభ్రపరిచిన బీజేపీ నాయకులు
• గాలి గోపురం బస్సు షెల్టర్, ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల శుభ్రత





**మారేడుమిల్లి, సెప్టెంబర్ 30 (తరంగాలు ప్రతినిధి ):** భారత ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ, పాలనా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా బుధవారం మారేడుమిల్లి మండలంలో బీజేపీ శ్రేణులు విస్తృత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించాయి.మండలంలోని మల్లవరం గ్రామ సమీపంలోని గాలి గోపురం బస్సు షెల్టర్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం, మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, తుప్పలను శ్రమదానంతో తొలగించి ప్రదేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.సుమారు 20 గ్రామాలకు చెందిన గిరిజన ప్రజలు దాదాపు 12 కిలోమీటర్ల మేర నడిచి వచ్చి ఈ బస్సు షెల్టర్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుంటారని నాయకులు తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న బస్సు షెల్టర్ వ్యర్థాలతో నిండిపోయిన విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు స్పందించి శుభ్రత కార్యక్రమం చేపట్టారు. ప్లాస్టిక్ రహిత డ్రైవ్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు.అదేవిధంగా బస్సు షెల్టర్ సమీపంలోని ప్రసిద్ధ ఆంజనేయస్వామి దేవాలయం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రపరిచారు.మారేడుమిల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కుండ్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఈక బుల్లి కొండలు దొర, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు), జిల్లా ప్రధాన కార్యదర్శి కుండ్ల కృష్ణారెడ్డి, రంపచోడవరం మండల ప్రధాన కార్యదర్శి దాడి గనిరాజు, మండల కార్యదర్శులు కత్తుల భూమిరెడ్డి, గగనం చిన్నబ్బాయి రెడ్డి, కారుకోడి రామిరెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా?

టీమిండియా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా భారత క్రికెట్ జట్టు తదుపరి చీఫ్ సెలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అజిత్ అగార్కర్ ఈ పదవి నుంచి వైదొలగడంతో, ప్రస్తుతం సెలెక్షన్ కమిటీకి తాత్కాలిక హెడ్‌గా ఉన్న 39 ఏళ్ల ఓజానే పూర్తిస్థాయి చీఫ్ సెలెక్టర్‌గా నియమించనున్నట్లు తెలుస్తోంది. మంగళవారం గువాహటిలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో నలుగురు సెలెక్టర్ల కమిటీ సుదీర్ఘంగా సమావేశమైంది. వెస్టిండీస్‌తో రెండో వన్డేకు ఒకరోజు ముందు బర్సపరా స్టేడియంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో ప్రజ్ఞాన్ ఓజాతో పాటు శివ సుందర్ దాస్, అజయ్ రాత్రా, ఆర్‌పీ సింగ్ పాల్గొన్నారు. అయితే, మాజీ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఇందులో పాలుపంచుకోలేదు. సాధారణంగా ఒక ద్వైపాక్షిక సిరీస్ సమయంలో సెలెక్షన్ కమిటీ మొత్తం ఇలా సమావేశం కావడం అరుదు కావడంతో, ఓజా నియామకం దాదాపు ఖరారైనట్లేనని తెలుస్తోంది. త్వరలో ప్రారంభం కానున్న న్యూజిలాండ్ పర్యటనకు భారత జట్లను ఎంపిక చేసే విషయంపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం.

# గురుకుల పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి





• వసతులు బాగుండేలా చర్యలు చేపట్టాలి
• టైం టేబుల్ ప్రకారం సిలబస్ పూర్తి కావాలి
• హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30,తరంగాలు :** గురుకుల పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రం లోని రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు.ముందుగా విద్యార్థులతో మాట్లాడి ఈరోజు ఎం బ్రేక్ ఫాస్ట్ ఇచ్చారు.. వంటలు ఎలా ఉంటున్నాయి, టీచర్లు అందరూ వస్తున్నారా అని తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో, కళాశాలలోని తరగతి గదులు, డార్మేట్రీ వసతులను కలెక్టర్ పరిశీలించారు. అన్నీ గదుల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఫ్యాన్ లు ఉన్నాయా అని ఆరా తీశారు. దోమలు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు డార్మేట్రి, టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నారా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తున్నారా, టైం టేబుల్ ప్రకారం అన్నీ తరగతులు జరుగుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. వంట గదిని సందర్శించి వంట పదార్థాలు ఎలా ఉన్నాయని తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... టైం టేబుల్ ప్రకారం అన్నీ తరగతుల సిలబస్ ను ఉపాధ్యాయులు పూర్తి చేయాలన్నారు.విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా డార్మేట్రీ గదులకు మెష్ డోర్ లను ఏర్పాటు చేయాలన్నారు. వసతులు బాగుండేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఇతర ఆహార పదార్థాలను నాణ్యతతో అందించాలన్నారు.కూరగాయలు, నిత్యావసరాలు తాజాగా, నాణ్యతగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి, తహసీల్దార్ కోమీ, వైస్ ప్రిన్సిపల్ సజన, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు



• అంగన్‌వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి
• అంగన్‌వాడీల్లో పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం
• టీచర్లు,సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులకు ఆదేశం
• పప్పు దినుసుల మిల్లు ఏర్పాటుపై పరిశీలన
• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**పర్వతగిరి, సెప్టెంబర్ 30 (తరంగాలు ప్రతినిధి ):** అంగన్‌వాడీల్లో నిర్లక్ష్యం సహించేది లేదని, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.పర్వతగిరి మండలంలో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయి అధికారులతో కలిసి కొంకపాక, పర్వతగిరి మార్కెట్ యార్డులను సందర్శించి వివిధ కార్యక్రమాలకు అనువైన స్థలాలను పరిశీలించారు.వీవోల సభ్యులతో కలిసి



ఆర్గానిక్ పప్పు దినుసులు, మిల్లెట్స్, మిల్లు ఏర్పాటు, అరటి, మోదుగు ఆకులతో విస్తర్లు, టిఫిన్ ప్లేట్లు తదితర ఉత్పత్తుల తయారీకి అనువైన ప్రాంతాలను పరిశీలించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో కంది, ఇతర పప్పు దినుసుల మిల్లును ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా పండే పంటలకు విలువ జోడించడంతో పాటు మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే అంశంపై అధికారులతో చర్చించారు.మిల్లు ఏర్పాటుకు అవసరమైన స్థలం, వీవో భవన నిర్మాణానికి స్థల పరిశీలన, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు.అనంతరం దౌలత్‌నగర్, ఉట్టి తండాలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లో పరిశుభ్రత సక్రమంగా లేకపోవడంపై సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు తప్పనిసరిగా యూనిఫాం ఉండేలా చూడాలని, మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం



అందించాలని ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశు భ్రతను తప్పనిసరిగా పాటించేలా ఆయాలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపైనా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ టీచర్లకు, కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయని అంగన్‌వాడీ సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.ఉట్టి తండాలో బుద్ధిమాంద్యం ఉన్న చిన్నారులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆప్యాయంగా పలకరించారు. వారిని భవిత సెంటర్లకు పంపించి అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో నాగపద్మజ, జిల్లా సంక్షేమ అధికారి నాగమణి, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో తదితర అధికారులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
గురువారం, 01 అక్టోబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- బొమ్మలరామారం మండలంలో 1,609 నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 30 తరంగాలు**

బొమ్మలరామారం మండలంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. అర్హత పొందిన 1,609 కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రేషన్ కార్డు ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సౌలభ్యం కలుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలో కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్, అలాగే ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అదేవిధంగా పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవుళ్లను విభజించి రాజకీయాలా

- సీఎం స్థాయికి తగ్గట్లు మాట్లాడాలి: కొర్ర సుమలత



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 30 (తరంగాలు):** హిందూ సమాజం ఆరాధించే శ్రీరాముడు, పరమశివుడిని పేద--ధనిక, ఉత్తర--దక్షిణ ప్రాంతాలుగా విభజిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరంగా ఉన్నాయని బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొర్ర సుమలత మండిపడ్డారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి శ్రీరాముడు ధనికుల దేవుడు, శివుడు పేదల దేవుడు అన్న భావనతో పాటు ఉత్తర, దక్షిణ ప్రాంతాల భక్తి సంప్రదాయాలను వేర్వేరుగా ప్రస్తావించిన నేపథ్యంలో కొర్ర సుమలత ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ సహా పలు వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "దేవుళ్లను కూడా విభజించి రాజకీయాలు చేయడం ఏమిటి?" అని కొర్ర సుమలత ప్రశ్నించారు. భక్తులకు శ్రీరాముడైనా, పరమశివుడైనా ఆరాధ్య దైవాలేనని, దేవుళ్లను పేద--ధనిక అనే వర్గాలుగా చూడటం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మత విశ్వాసాలకు సంబంధించిన అంశాలపై మరింత బాధ్యతగా, సంయమనంతో మాట్లాడాల్సిన అవసరం ఉందని సుమలత సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల విశ్వాసాలను, దైవాలను రాజకీయ చర్చల్లోకి తీసుకురావడం సముచితం కాదని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో, సోదరభావంతో జీవిస్తున్నారని, రాజకీయ నాయకులు ప్రజలను ఏకం చేసే మాటలు మాట్లాడాలని ఆమె అన్నారు. "దేవుళ్లను విభజించడం కాదు.. ప్రజలను కలిపే రాజకీయ సంస్కృతి కావాలి" అని కొర్ర సుమలత స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను పునఃపరిశీలించి, హిందూ సమాజం మనోభావాలను గౌరవించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన బాధ్యతతో వ్యవహరించాలని, మత విశ్వాసాలను రాజకీయ విభజనలకు వేదికగా మార్చవద్దని కొర్ర సుమలత హితవు పలికారు.

## బతుకమ్మ బండ్ నిర్మాణానికి భూమిపూజ

- చెరువు కట్టపై బతుకమ్మ విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం



**పర్వతగిరి, సెప్టెంబర్ 30 (తరంగాలు ప్రతినిధి ):** గ్రామంలోని చెరువు కట్టపై దర్గా సమీపంలోని మెట్ల వద్ద బతుకమ్మ బండ్‌లో బతుకమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న స్థలంలో బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ భూమి పూజ చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు చెరువు వద్దకు చేరుకునే ప్రదేశంలో బతుకమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో భూమిపూజ చేపట్టారు. గ్రామంలో బతుకమ్మ బండ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, ఉపసర్పంచ్ గొడుగు ఏకాంత సారయ్య, వరంగల్ మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి పాల్గొన్నారు. వార్డు సభ్యులు రాపోలు అనిత రవీందర్, ముంజంపల్లి నాగరాజు, గాడిపెల్లి రాజబాబు, బత్తిన జలంధర్, కొండేటి కొమరమ్మ రామచందర్, కారోబార్ గుండ యాకయ్య, వాటర్‌మెన్ రామచందర్, తంగళ్లపల్లి రవీంద్ర చారి, పత్రికా సంపాదకుడు గొల్లపల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

- గ్రామాభివృద్ధి పనులపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్
- వీబీ-జీ రామ్ జీ పథకం అమలుపై సమీక్ష.. అధికారులకు కీలక సూచనలు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సీ, సెప్టెంబర్ 30 (తరంగాలు):** గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని మంత్రి సీతక్కఅన్నారు. వలిగొండ మండల కేంద్రంలో బుధవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీబీ-జీ రామ్ జీ పథకం, గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల అమలు, పురోగతిపై మంత్రి సమీక్షించారు. వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వీబీ-జీ రామ్ జీ పథకం అమలు, సోక్‌పిట్‌ల నిర్మాణం, ఎల్‌నినో ప్రభావం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సీతక్క పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం జారీ చేస్తున్న మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టి ఆదర్శ గ్రామాలుగా నిలవాలని, పనితీరు ఆధారంగా రివార్డులు కూడా ఉంటాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత, ఏపీఓ పరశురాములు, ఏపీఎం అంజయ్యతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## గత పాలకుల అక్రమ ఆస్తులపై విచారణ జరపాలి

- ఉద్యమకారులకు భూములు పంచాలి: కూరపాటి వెంకటనారాయణ



హనుమకొండ ప్రతినిధి , సెప్టెంబర్ 30 (తరంగాలు): తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన ఉద్యమకారులకు గత పాలకులు, నాయకులు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని పంచాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం బాలసముద్రంలోని తన నివాసంలో ఉద్యమ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలనలో రాజకీయ నాయకులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున భూములు, ప్రజా ఆస్తులను అక్రమంగా సంపాదించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకుని రైతుల, ప్రభుత్వ, అసైన్డ్ భూములపై జరిగిన అక్రమాలపై కూడా దర్యాప్తు చేయాలన్నారు. రాజకీయ ఆరోపణలకే విచారణ పరిమితం కాకుండా నిర్దిష్ట కాలవ్యవధిలో దర్యాప్తు పూర్తి చేసి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరిగిన భూ అక్రమాలపై విచారణను విస్తరించాలని కోరారు. ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కుటుంబాలు, వేలాది ఉద్యమకారులకు గత పాలకులు తగిన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి న్యాయం చేయడంతో పాటు అవసరమైన సంక్షేమ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో చిల్లా రాజేంద్ర ప్రసాద్, దారం జనార్ధన్, సాయిని నరేందర్, బొమ్మినేని పాపిరెడ్డి, దొమ్మాటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## షేక్ లియాకత్ అలీని సన్మానించిన అధికారులు, సిబ్బంది



**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 30 ( తరంగాలు )**

రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ లియాకత్ అలీ గత 33 సంవత్సరాల సుదీర్ఘ సేవలను పూర్తి చేసుకొని బుధవారం, 30-09-2026న పదవీ విరమణ పొందారు.

ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించి, షేక్ లియాకత్ అలీని కార్యాలయ అధికారి మరియు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది అభినందించారు. దీర్ఘకాలం పాటు కార్యాలయంలో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, తన సేవలతో సహచరుల మన్ననలు పొందిన షేక్ లియాకత్ అలీకి అధికారులు, సిబ్బంది పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి బాలేశ్వరి, ఏవీఎస్ ప్రసాద్, టైపిస్టు అనిత, ఆఫీస్ సబార్డినేట్ ఫకీర్ చంద్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## షాపెల్లిలో కోతులను నివారించాలి

- సిపిఐ మండల జోన్ బాధ్యులు వడ్లకొండ సుధాకర్



**జఫర్గఢ్ ప్రతినిధి, సెప్టెంబర్ 30,(తరంగాలు ):** మండలంలోని షాపెల్లి గ్రామంలో కోతులను నివారించి గ్రామ ప్రజలకు సహకరించాలని సిపిఐ పార్టీ మండల జోన్ బాధ్యులు వడ్ల కొండ సుధాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ) ఆధ్వర్యంలో గ్రామంలో పేరుకుపోయిన స్థానిక సమస్యలను పరిష్కరించాలని గ్రామ ఉపసర్పంచ్ పులిగిల్ల మమతకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వడ్లకొండ సుధాకర్ మాట్లాడుతూ కోతుల బెడద రోజు రోజుకు పెరిగి గ్రామంలో గుంపులు గుంపులుగా సంచరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వృద్ధులను, చిన్నపిల్లలను గాయాల పాలు చేస్తున్నాయన్నారు. అదేవిధంగా వ్యవసాయ పంటలను ధ్వంసం చేసి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. దీంతో వేల కొద్ది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంట నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. అదేవిధంగా గ్రామంలో లో త్రాగునీటి కొరత ఉందని దీన్ని పరిష్కరించి, తాగునీటి నాణ్యతను పరీక్షించి త్రాగునీరు రోజువారీగా క్రమం తప్పకుండా సరఫరా చేయాలన్నారు. గ్రామంలో పూర్తిస్థాయిలో సిసి రోడ్డు నిర్మాణాలు ప్రాధాన్యత క్రమంలో నిర్మాణం చేపట్టాలన్నారు. గ్రామంలో ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలందరికీ అదే విధంగా గ్రామ నూతన పాలకమండలి సహకరించాలని కోరారు. సీజన్ వ్యాధులు సోకకుండా గ్రామంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు, దోమల మందు పిచికారి చేసి దోమల బెడదను నివారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అంతర్గత రోడ్ల వెంబడి పిచ్చి మొక్కలను తొలగించి క్రిమి కీటకాల విష పురుగుల ప్రమాదాల బారి నుండి కాపాడాలన్నారు. లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకురాలు నూర్జిస, మండల నాయకులు వేల్పుల పెదరాములు, గ్రామ నాయకులు వెంకన్న,మాచర్ల రమేష్, రాజకుమార్, ఎమ్ రాజు, పి రాజు, వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక



**పాలేరు ఆర్సీ, సెప్టెంబర్ 30 (తరంగాలు ) :** కూసుమంచి మండల వ్యాప్తంగా ముమ్మరంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహిస్తూ పనులను గుర్తిస్తున్నట్లు సర్పంచ్ భూక్యా శిరీష, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీను, మండల ఉపాధి అధికారులు తెలిపారు. బుధవారం వి బి జి రామ్ జి పథకం అమలులో భాగంగా రాజుపేట బజార్, పంచాయతీలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాల్లో సామాజిక పటం, సహజ వనరుల పటం ప్రజల భాగస్వామ్యంతో గీయించి పనులను గుర్తించడం జరిగినట్లు టీ ఏ భవాని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న వి బి జి రామ్ జి పథకం ప్రతి గ్రామంలో విజయవంతంగా అమలయ్యే విధంగా కిందిస్థాయి నుంచి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమం అమలులో సర్పంచ్, పాలకవర్గం, అధికారులు కీలక పాత్ర వహించాలని తెలిపారు. అందరి సహకారంతోనే పథకం విజయవంతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా శిరీష , ఉపసర్పంచ్ జవ్వాజి మౌనిక, పాలకవర్గం సభ్యులు, టీ ఏ భవాని, గ్రామ కార్యదర్శి కోట శ్రీను, గ్రామస్తులు. తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించిన గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్





**నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:30(తరంగాలు)**
గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో భారీగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. అన్ని రకాల కార్యక్రమాలతో విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తిని కలిగించే గీతాంజలి విద్యాసంస్థ ఈ విభిన్నమైన పద్ధతిలో ఫలహార ప్రదర్శనను చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు గారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి మొదలుకొని యూకేజీ వరకు విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని వారి ఇంటి వద్ద తయారుచేసిన రకరకాల పిండి వంటలు మరియు వారి సంప్రదాయ రుచులను అందరికీ పరిచయం చేసి విద్యార్థులతో పాటు విందులో పాల్గొని ఆనందించారు. అట్టి రుచులను చవి చూసిన వేములపల్లి సుబ్బారావు గారు వారి ఆహారపు అలవాట్లను పిల్లల పట్ల వారు చూపుతున్న శ్రద్ధను చూసి వారికి సలహాలతో పాటు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ముందు ఆరోగ్యం ముఖ్యమని అందుకు బలవర్ధమైన పోషక ఆహారంతో విద్యార్థుల కడుపు నింపినప్పుడే వారి ఆరోగ్యం బాగుండి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతారని, ఏ రుగ్మతలు లేని విద్యార్థులు అన్ని అంశాలలో చురుకుగా పాల్గొని,విజయాలు సాధిస్తారని, అంతే కాకుండా అంతరించి పోతున్న మన పూర్వీకుల ఆహారపు అలవాట్లు వారి ఆరోగ్య రహస్యాలను తెలిపినందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు పాల్గొని విందు ఆరగించి విద్యార్థులు తెచ్చిన పిండి వంటలను రుచి చూసి బుక్తాయాసంతో ఇబ్బంది పడి విద్యార్థుల వాత్సల్యాన్ని చూసి ఆనందించారు.

# ఇల్లందు13వ వార్డులో పోషణ మాస మహోత్స వాలు

- పోషకాహారం పై అవగాహన పెంపొందించడమే లక్ష్యం
- ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించిన13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య



**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 30, ( తరంగాలు ):** ఇల్లందు పట్టణంలోని 13వ వార్డు హమాలి బస్తి అంగన్వాడీ సెంటర్‌లో పోషణ మాస మహోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోషకాహారం, ఆరోగ్యం, తల్లీబిడ్డల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దండు సారయ్య మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యక రమైన ఎదుగుదలకు అంగన్వా డీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసు కోవాలని కోరారు. పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైనఆహా రపు అలవాట్లను పాటిం చాల ని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇల్లందు ఐసీడీఎస్ అధికారి అరుణ, సూపర్వైజర్ రోహిణి, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గర్భిణులు, బాలిం తలు, కిశోర బాలికలు, అంగన్వాడీ చిన్నారు లు, వారి తల్లిదండ్రులు పాల్గొ న్నారు.



# వేలేరు మండల అధ్యక్షుడిని పరామర్శించిన సింగపురం ఇమానియేల్ రాజ్





**స్టేషన్ ఘన్పూర్ సెప్టెంబర్ 30,(తరంగాలు):** వేలేరు గ్రామంలో వేలేరు మండల అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నారాయణ నాయక్ని పరామర్శించిన స్టేషన్ ఘనపూర్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరా కుమారుడు యువ నాయకులు సింగపురం ఇమానియేల్ రాజ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబని పరామర్శించారు. వారి కుటుంబాని కి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వద్లూరి మౌనిక , హనుమకొండ జిల్లా కార్యదర్శిలు బత్తిని ఎల్ల గౌడ్, ప్రభాకర్ గౌడ్ హనుమకొండ ఎస్సీ సెల్ కార్యదర్శి చిట్యాల భరత్, వేలేరు మాజీ వార్డ్ సభ్యులు రాజేందర్,ప్రశాంత్,హరీష్, జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ కొమురయ్య జిల్లా ఎస్ఎల్ కార్యదర్శి శోభన్ జనగామ జిల్లా కార్యదర్శి లు శగంటి మని, తాటికొండ సంపత్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య జనగాం జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శులు మాతంగి కుమార్ సారంగపాణి చిల్పూర్ మండల్ బీసీ సెల్ అధ్యక్షులు కండ్లకోల్ల బాలరాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మారపాక యాదగిరి, జఫర్గడ్ అధికార ప్రతినిధి మహమ్మద్ ముక్తార్ అలీ, వెంకటేశ్వర పల్లె గ్రామ శాఖ అధ్యక్షులు బట్టమేకల శివరాజ్ యాదవ్, నష్కల్ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు కోతి రాజు గౌడ్, చిల్పూర్ మహిళా నాయకురాలు నారగోని సరిత,చిల్పూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీడి కోర్నేలు, వీరితోపాటు వేలేరు కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు,యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నల వర్షం కురిపించిన కౌన్సిలర్ శివ కిరణ్



**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 30, ( తరంగాలు)** : ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్ పలు ప్రజా సమస్యలను లేవనెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ లేబర్ గా పనిచేస్తున్న నలుగురు కార్మికులను ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించడం వల్ల వారికి ఇందిరమ్మ ఇళ్లు రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఎల్-3 నుండి ఎల్-1 కు మార్చి ఇందిరమ్మ ఇళ్లు వచ్చే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా 18, 19, 20, 21, 22, 23, 24 వార్డులలో చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులు లేవని, వెంటనే దానికి సంబంధించిన పైప్ లైన్ టెండర్ ను పిలిచి పనులు ప్రారంభిం చాలని డిమాండ్ చేశారు. రానున్న బతుకమ్మ పండుగ నేపథ్యంలో నూతనంగా వేసిన స్తంభాలకు దీపాలు లేవని, వెంటనే లైట్లు ఏర్పాటు చేసి పండుగ నాటికి పూర్తి చేయా లని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నందు 35 సంవత్సరాలు గా మున్సిపల్ జవాన్ గా విధులు నిర్వహించిన అంజత్ కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలుపటం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ రాజు, కమిషనర్ సందీప్, శేరిలింగంపల్లి ఆర్వో అంజన్ కుమార్, డి ఈ నవీన్, మేనేజర్ ఇందూరు శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారు లు తదితరులు పాల్గొన్నారు.



# బొజ్జయిగూడెం పంచాయతీలో అక్రమ నిర్మాణాల జోరు



- ఏజెన్సీ 1/70 చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు
- చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 30, ( తరంగాలు ):** ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం పంచాయతీ పరిధిలో గల అన్నారం గ్రామ ప్రధాన రహదారి ప్రక్కన ఎలాంటి అనుమతులు లేకుండా, ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ఓ బడా బాబు తన పని తాను చేసుకుపోతున్నారు.. ఏజెన్సీ ప్రాంత పరిరక్షణ చట్టాలను అధికారులే తుంగలో తొక్కుతున్న పరిస్థితి ఇల్లందు మండలంలో నెలకొంది అంటున్న ప్రజాసంఘాలు. పంచాయితీ, రెవెన్యూ అధికారుల తీరుపై ప్రజాసంఘాలు ఆగ్రహిస్తున్నారు ... అనుమతులతో సంబంధం లేదు అన్నట్లుగా ఆ బడా బాబు దర్జాగా పునాదులు తీసి మట్టి తోలిస్తూ భవన నిర్మాణానికి పూనుకోవడం గమనర్హం.. షెడ్యూల్ ప్రాంతాలలో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా నిర్మాణాలు జరుగుతుంటే పంచాయితీ కార్యాలయం నుండి నోటీసు ఇచ్చే పరిస్థితి లేదనే వాదనలు అనేకం. సామాన్యుడు మామూలుగా రేకుల షెడ్డు వేసుకోవాలన్నా పంచాయతీ పరిమిషన్ల పేరుతో నోటీసులు ఇస్తున్న ఈ రోజుల్లో, ఏజెన్సీ ప్రాంతాలలో ఏకంగా రోడ్డు ప్రక్కన ఇంత పెద్ద అక్రమ నిర్మాణం చేపడుతుంటే 1/70 చట్టం ఈ భవనానికి వర్తించదా అంటూ ప్రశ్నిస్తున్నారు .... ఇంత పెద్ద నిర్మాణం నిర్మిస్తున్న అధికారులు కన్నెత్తి చూడకుండా ఉండటం పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి...? కళ్ళ ముందే అక్రమ నిర్మాణాలు చేపడుతున్న, ఏజెన్సీ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్న నోరు మెదపని పంచాయతీ, రెవిన్యూ అధికారుల తీరుపై తక్షణమే విచారణ జరిపి నిర్మాణాన్ని నిలుపదల చేయాలని ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నాయి... లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని స్పష్టం చేశారు..



# ప్రజల సమస్యలపై మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌కి వినతి పత్రం అందజేసిన 13 వార్డు కౌన్సిలర్ దండు సారయ్య

- మంచినీటి సరఫరాను క్రమబద్ధీకరించాలి
- పైపులైన్ల లీకేజీలు, నీటి సరఫరా లోపాలను గుర్తించి పరిష్కరించాలి
- ప్రతి వార్డులో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలి
- చెత్త చెదారం, మురుగు కాలువలను సకాలంలో శుభ్రపరచాలి
- కోతుల బెడద పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలి
- వీధి కుక్కల నియంత్రణకు నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలి
- ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ ను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలి
- పట్టణంలోని పనిచేయని వీధిలైట్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలి
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించేలా సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలి




**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్30,( తరంగాలు):** ఇల్లందు పట్టణంలోని పలు సమస్యలపై 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మున్సిపల్ కమిషనర్ , చైర్మన్ కి వినతి పత్రం అందజేశారు. పట్టణంలో మంచినీటి సరఫరా, పారిశు ద్ధ్యం, కోతులు, వీధి కుక్కలు, సెంట్రల్ లైటింగ్, వీధిలైట్ల సంబంధించిన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. మున్సిప ల్ పరిపాలన పరిధిలోని ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంద న్నారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతు న్నాయని, సంబంధిత సిబ్బం దితో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి పైపులైన్ల లీకేజీలు, మోటార్లు, సరఫరా వ్యవస్థలో ఉన్న సాంకేతిక సమస్యలను గుర్తించి మరమ్మతులు చేపట్టా లన్నారు. అలాగే నీటి సరఫరా సమయాలను కూడా క్రమబద్ధీ కరించాలన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం కాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించి చెత్తను సకాలంలో తొలగించడం, మురుగు కాలు వలను శుభ్రపరచడం, దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో కోతులు ఇళ్లలోకి ప్రవేశిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వీటికి తోడు వీధి కుక్కల బెడద కూడా పెరుగుతుందన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



### సెంట్రల్ లైటింగ్, వీధిలైట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని.

ఇల్లందు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌లో కొన్ని లైట్లు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో రహదారి చీకటిగా మారుతున్న ప్రాంతాలు ఉన్నాయని,అలాగే పట్టణంలోని పలు వార్డుల్లో వీధిలైట్లు పనిచేయకపోవడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని తెలిపారు. వెంటనే సెంట్రల్ లైటింగ్, వీధిలైట్లను క్షేత్రస్థా యిలో పరిశీలించి పనిచేయని లైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల ఆరోగ్య, భద్రత, ప్రాథ మిక సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పై సమస్యలపై తక్షణమే క్షేత్రస్థాయి చర్యలు చేపట్టి పరిష్కరించాలని కోరారు..

# వృద్ధాశ్రమాలకు లైసెన్స్ తప్పనిసరి

- సేవా దృక్పథం తో వృద్ధ ఆశ్రమాలను నిర్వహించండి
- వసతులు బాగుండాలి
- వృద్ధులు ఇబ్బందులు పడొద్దు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 30,తరంగాలు** : సేవా దృక్పథం తో వృద్ధాశ్రమాలను నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని పది వృద్ధాశ్రమాలను సెప్టెంబర్ ఇరవై ఐదు నుండి ముప్పై వరకు నిర్వహించిన తనిఖీలో భాగంగా ఆశ్రమాలలో కనీస ప్రమాణాలు పై అధికారులు సమర్పించిన నివేదికలపై బుధవారం రోజున మినీ కాన్ఫరెన్స్ హాల్ లో అధికారులు, ఆయా వృద్ధాశ్రమాల నిర్వాహకులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వృద్ధులకు అండగా వృద్ధాశ్రమాల నిర్వహణ ఉండాలని అన్నారు. వారికీ ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నీ వసతులు ఉండాలన్నారు. చాలా మంది నిర్వాహకులు వృద్ధాశ్రమాల కనీస ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్వహిస్తున్నారని, ఇలాగే కొనసాగితే సంబంధిత నిర్వాహకులకు నోటీస్ అందించడం జరుగుతుందన్నారు ఆ తర్వాత చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇది మొదటి అవకాశంగా భావించి, భవిష్యత్ కార్యాచరణ, ముందు చూపుతో పని చేయాలని,ఈ సమీక్ష ఒక సెన్సిటిజేషన్ గా భావించాలని తెలిపారు. ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్ వస్తుందా అని అడుగగా కొంతమందికి వస్తుందని, అట్టి మొత్తం వారి వారి వ్యక్తిగత అవసరాలకు ఉపయోగిస్తున్నామని, కొందరికి ఆధార్ కార్డ్స్ లేవని చెప్పగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని, ఆధార్ కోసం సంబంధిత తహసీల్దార్ తో మాట్లాడి అవసరమైన డాక్యుమెంట్స్ కలెక్ట్ చేసుకొని ఆధార్ కార్డ్ జారీ కోసం చర్యలు తీసుకోవాలని, ఒక్కో వృద్ధాశ్రమాన్ని సందర్శించి కనుక్కోవాలని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ కు సూచించారు. వృద్ధాశ్రమాలు లైసెన్స్ కలిగివుండాలని, సంబంధిత అధికారులను సంప్రదించి లైసెన్స్ పొందాలని, లైసెన్స్ ఉన్నవారు రెన్యువల్ గడువు తర్వాత సరిచేసుకోవాలని, సీసీ కెమెరాల నిర్వహణ ఉండాలని అన్నారుసేవా దృక్పథంతో పని చేసి వయో వృద్ధులకు సేవలందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం విశ్వజ, సిడిపిఓ లు వి సింధురాణి, సిహెచ్ అవంతి, కె స్వాతి, ఇంచార్జి డిసిపిఓ ఎస్ ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, రాజేష్ ,చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్ భాస్కర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఝాన్సీ, పద్మ, వృద్ధాశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సఫాయి మిత్రల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- యూపీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ.. డీఎంహెచ్‌ఓ తుకారం రాథోడ్ కీలక సూచనలు

**కొత్తగూడెం,జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 30:**
ఓల్డ్ కొత్తగూడెంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులు, రిజిస్టర్లు, ల్యాబొరేటరీ, ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించారు. గర్భిణీల జుణణ వివరాలను మూడు నెలలకు సంబంధించిన క్యాలెండర్‌లో ఎప్పటికప్పుడు నవీకరించాలని, ప్రసవానికి ముందే హైరిస్క్ గర్భిణీలను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. మలేరియా, డెంగ్యూ పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉండేలా స్టాక్‌ను పర్యవేక్షించాలని తెలిపారు.




### సఫాయి మిత్రలకు ఆరోగ్య భద్రతపై అవగాహన

జంతు, పాము కాట్లకు తక్షణ వైద్యం.. మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

అనంతరం నిర్వహించిన సఫాయి మిత్ర--సేఫ్టీ అండ్ డిగ్నిటీ క్యాంప్‌లో డీఎంహెచ్ఓ పాల్గొని పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యం, భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సమతుల ఆహారం, సురక్షిత తాగునీరు, వ్యక్తిగత--పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కుక్కలు, ఇతర జంతువులు లేదా పాము కరిచినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలని, మంత్రాలు, మూఢనమ్మకాలు, శాస్త్రీయ ఆధారం లేని చికిత్సలతో సమయం వృథా చేయవద్దని స్పష్టం చేశారు. సఫాయి మిత్రలు పట్టణ పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి ఆరోగ్యం, భద్రత, గౌరవం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.

### కార్యాలయ సిబ్బందికి గుండె ఆరోగ్యంపై అవగాహన

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సిబ్బందికి గుండె ఆరోగ్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్లక్ష్యం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ఎం. సుకృత, డాక్టర్ జాన్సీ రామ్, డాక్టర్ కృష్ణ కుమారి, మున్సిపల్ మేయర్ గణేష్, కమిషనర్ సుజాత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, సఫాయి మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగులో మార్పు తప్పనిసరి

- ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి
- అక్టోబర్ 2న గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులను గుర్తించాలి
- మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి



**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 30 (తరంగాలు):**
ప్రస్తుతం దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ఏలినో ప్రభావం దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి సూచించారు. బుధవారం వర్ధన్నపేట రైతు వేదికలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ అబ్బీడి రాజిరెడ్డి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. అలాగే పేద, కూలీ వర్గాల ప్రజలకు వీబీ-జీ రామ్-జీ పథకం ద్వారా ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లకు గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. గ్రామసభల్లో గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అదేవిధంగా వీబీ-జీ రామ్-జీ పథకం కింద గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గ్రామసభల్లో గుర్తించి, ఆయా పనులకు గ్రామసభ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో జుమ్మిలాల్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రూ.1.82 కోట్ల గంజాయి పట్టివేత

- 365.2 కిలోల గంజాయి స్వాధీనం.. లారీ, కారు, బైక్ సీజ్
- ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా ఎక్సైజ్ అధికారుల దాడి

**భద్రాచలం,తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 30:**
ఒరిస్సా నుంచి మహారాష్ట్రకు మూడు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి నిల్వను ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పట్టుకున్నాయి. మొత్తం 365.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోగా.. దీని విలువ సుమారు రూ.1.82 కోట్లు ఉంటుందని ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపారు. భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్ సమీపంలో డీటీఎఫ్ కొత్తగూడెం బృందం వాహనాల తనిఖీలు చేపట్టింది. తొలుత బైక్‌పై వస్తున్న ఒరిస్సాకు చెందిన లిదివాకర్ మండల్ (22)లిను తనిఖీ చేయగా 9 కిలోల గంజాయి లభించింది. బైక్‌ను సీజ్ చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అదే మార్గంలో వెనుక వస్తున్న హుందాయ్ కారుపై అనుమానంతో తనిఖీలు చేయగా 100 కిలోల గంజాయి బయటపడింది. ఈ కేసులో ఒరిస్సాకు చెందిన ఎలక్ట్రీషియన్ లిసుమన్ పాల్ (22)లిను అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేశారు.



### నిందితుల సమాచారంతో మరో లారీ పట్టివేత

ఇద్దరు నిందితులను విచారించగా మరో లారీలో గంజాయి ఉన్నట్లు సమాచారం ఇచ్చారు. దీంతో కరుణగిరి సమీపంలో నిలిపి ఉన్న లారీని తనిఖీ చేయగా 263.2 కిలోల గంజాయి పట్టుబడింది. లారీలో ఉన్న ఒరిస్సాకు చెందిన లిరాజశేఖర్ మార్గి (22), క్లీనర్ బ్రిజన్ నాసా (20)లిలను అదుపులోకి తీసుకున్నారు. లారీని కూడా సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో కొత్తగూడెం డీటీఎఫ్ సీఐ రమాదేవి, సీఐలు కిష్టయ్య, నరేందర్‌రెడ్డి, ఎస్ఐలు సలీముల్లాఖాన్, శ్రీధర్‌రావు, సిబ్బంది కరీం, మౌలాంకర్, వీరబాబు, శ్రీనివాస్, నర్సింహారావు, రమేష్, పార్థసారథి, విల్సన్, సీతారాం, వీరభద్రం, రాకేష్, కిరణ్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్న ఎక్సైజ్ బృందాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అవినాష్ మహంతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
గురువారం, 01 అక్టోబర్ , 2026



# ఆరోగ్యమే విద్యార్థుల అసలైన బలం





**•చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి - గొడిశాల శ్రీనివాస్**
**•అనారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు**
**•లక్షణాలు కనిపించిన వెంటనే పెద్దలకు చెప్పాలి**
**•-పల్లె దవాఖాన డాక్టర్ సురేష్**
**•కాకతీయ పాఠశాలలో హెల్త్ క్యాంప్..**
**•వైద్య పరీక్షలతో ఆరోగ్య భద్రతపై అవగాహన**

**వర్ధన్నపేట ప్రతినిధి,, సెప్టెంబర్ 30 (తరంగాలు):** ఆరోగ్యమే విద్యార్థుల అసలైన బలం అని,చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొడిశాల శ్రీనివాస్ అన్నారు.వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని కాకతీయ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. పల్లె దవాఖాన వైద్యులు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థుల బీపీ, సాధారణ ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమస్యలు తలెత్తినప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.వైద్య సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, స్వచ్ఛమైన నీటిని తాగడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అలవాట్లను పాటించాలని తెలిపారు. జంక్‌ఫుడ్, అధికంగా నూనె, ఉప్పు, చక్కెర ఉన్న ఆహార పదార్థాలకు దూరంగా ఉండి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, పాలు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.అలాగే విద్యార్థులు తగినంత నిద్ర, శారీరక వ్యాయామం, ఆటలు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కువసేపు మొబైల్ ఫోన్లు, టీవీ, ఇతర డిజిటల్ పరికరాలను ఉపయోగించకుండా కళ్లకు విశ్రాంతి కల్పించాలని అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, కడుపునొప్పి వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పెద్దలకు తెలియజేసి వైద్యుల సలహా తీసుకోవాలని చెప్పారు.విద్యార్థులు వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకుండా ఉండటం, దగ్గు--తుమ్ముల సమయంలో నోరు, ముక్కును కప్పుకోవడం, అనారోగ్యంగా ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు.

ఈ క్యాంప్‌లో ఏఎన్‌ఎంలు సరోజ, అపరంజి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోడిశాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు.



## గడ్డం రాములు ఉద్యోగ పదవీ విరమణ

**•కార్యక్రమం లో పాల్గొన్న యూనియన్ నాయకులు**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30:**
హార్టికల్చర్ శాఖలో 30 సంవత్సరాలు డ్రైవర్‌గా సేవలందించిన గడ్డం రాములు పదవీ విరమణ కార్యక్రమం ఖమ్మం లోని సివిఆర్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హార్టికల్చర్ జిల్లా అధికారి మధుసూదన్ అధ్యక్షత వహించగా, టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఒ టీజీఈ జెఎసి ఖమ్మం జిల్లా చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గడ్డం రాములు దంపతులను గుంటుపల్లి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గడ్డం రాములు గత 30 సంవత్సరాల పాటు హార్టికల్చర్ శాఖకు అంకితభావంతో సేవలందించి మంచి పేరు సంపాదించారని, ఉద్యోగ సంఘ కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారని కొనియాడారు.పదవీ విరమణ అనంతరం కూడా పెన్షనర్ సంఘంలో చురుకుగా పాల్గొంటూ,కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టి జి ఓ ఎస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి , మహబూబాబాద్ హార్టికల్చర్ ఆఫీసర్ జీనుగు మరియన్న , టీఎన్జీవోస్ కోశాధికారి వల్లపు వెంకన్న , డ్రైవర్ల సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు , నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కు ,కార్యదర్శి వెంకటరమణ , టి హెచ్ డబ్ల్యు ఓ ఎస్ ఫోరం, ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు , టీఎన్జీవోస్ నాయకులు అబ్దుల్ ముఖిత్ , సలీం , కోటేశ్వరరావు, హార్టికల్చర్ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి వేగం పెంచాలి





**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసిన టీడీపీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియా (సురేఖ)**

ఢిల్లీ, సెప్టెంబర్ 30 (తరంగాలు ప్రతినిధి ):వరంగల్--మామునూరు విమానాశ్రయం అభివృద్ధి, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో తెలంగాణ తెలుగుదేశం పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ మరియా (సురేఖ) ఢిల్లీలో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మామునూరు విమానాశ్రయ అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని టీడీపీ పార్లమెంట్ కమిటీ సభ్యులు, ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలను గుర్తించి విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించాలని కోరుతూ కేంద్ర మంత్రికి మెమోరాండం అందజేశారు. మామునూరు విమానాశ్రయం కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వరంగల్ టీడీపీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వరంగల్ పార్లమెంట్ పరిధిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం ఓరుగల్లు శ్రీ భద్రకాళి అమ్మవారి చిత్రపటాన్ని కేంద్ర మంత్రికి బహూకరించారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యుల చిత్రపటాన్ని కూడా అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ప్రాంత అభివృద్ధి, మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ప్రజలకు కలిగే ప్రయోజనాలపై కూడా చర్చించారు. వరంగల్ టీడీపీ నాయకులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు చాడ మరియా (సురేఖ) తెలిపారు.

## పిఎసిఎస్‌లో మహాజన సభ సమావేశం



నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:30( తరంగాలు) ఖానాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సాధారణ మహాజన సభ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వల్లె శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సంఘం రైతుల మేలు కోరుకుంటుందని సంఘంలో 7500 సభ్యులు ఉండగా పట్టా భూములు కలిగిన రైతులు తక్కువగా ఉండడం వలన 500 మంది రైతులు మాత్రమే పంట రుణాలు పొందారని అందులో కొంతమంది రైతులు మాత్రమే సుమారు 250 మంది రైతులు మాత్రమే పంట రుణాలను వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకున్నారని మిగతా సభ్యులు కూడా రెన్యువల్ చేసుకోవాలని, లేనియెడల రైతు డిఫాల్ట్ అయ్యే అవకాశం ఉందని, రైతులు భవిష్యత్తులో ఎలాంటి రుణాలు ఏ బ్యాంకు ద్వారా కూడా పొందలేరని తెలిపారు. కొత్త రుణాలకు సంబంధించిన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తొందరలోనే అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేస్తామని రైతులకు తెలిపారు. సంఘంలో నూతన సభ్యత్వాలు కూడా త్వరలోనే ప్రభుత్వ అనుమతులు రాగానే రైతులకు తెలియజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలు గుర్తించి గోదాములు గాని కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని, వాటి ద్వారా సంఘానికి మరింత ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రైతులు తప్పనిసరిగా సొసైటీ కి సంబంధించిన కొనుగోలు కేంద్రాలలో క్రయ, విక్రయాలు నిర్వహించి సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం సీఈవో ఆంజనేయులు మాట్లాడుతూ నిర్వహించిన లావాదేవీలు నివేదిక రూపంలో రైతులకు అందించి కొనుగోళ్లలో వచ్చినటువంటి లాభాలను సంఘం సభ్యులకు, పాలకవర్గానికి చదివి వినిపించి, రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, సీనియర్ ఇన్స్పెక్టర్ కనకదుర్గ, డైరెక్టర్ లు శివరాత్రి వెంకన్న, మద్రి ప్రభాకర్, బండి వెంకన్న, దేవినేని వేణుగోపాలరావు, జటంగి నాగరాజు, భాష బోయిన రవి, ఎర్ర రజిత, లింగిడి వెంకటేశ్వర్లు, బలుగు లక్ష్మణ్, చెడిపాక రజిత, నునావత్ బిచ్చ నాయక్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, సంఘం సభ్యులు, రైతులు, సొసైటీ సిబ్బంది మేరుగు రాజు, కడుదూరి వినయ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుపై సర్వసభ్య సమావేశం

**ఎంపీడీవో- అద్వైత**



నర్సంపేట ప్రతినిధి, సెప్టెంబర్:30( తరంగాలు) ఖానాపురం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో అద్వైత ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాల అమలు, పనితీరును వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో చర్చించారు. పలు సమస్యల పరిష్కారానికి సర్పంచ్ల ఆధ్వర్యంలో తీర్మానాలు చేశారు. ప్రతి నెల 1,3 వ శనివారాల్లో గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో శ్రమదానం కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఎస్ టి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా సోలార్ ప్యానెల్ లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. శ్రీ శిశు సంక్షేమ శాఖలో 18 హెల్పర్స్, 4 టీచర్స్ లేరని గుర్తించి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. వడ్డీ లేని రుణాలు ఎటువంటి కమిషన్, ఫీజు లేకుండా రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తీర్మానించడం జరిగింది. పౌరసరఫరాల శాఖ సమీక్ష పై తాసిల్దార్ నంగునూరి రమేష్ వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ, మండల ప్రత్యేక అధికారి నారాయణరెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ వల్లె శ్రీనివాస్ యాదవ్, ఏ ఎం సి వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, తహసీల్దార్ నంగునూరి రమేష్, మండల అభివృద్ధి అధికారి డాక్టర్ వనపర్తి అద్వైత, వివిధ గ్రామాల సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

